# నిరంతర సేవకుడు వెంకట్రామిరెడ్డి

- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- నియోజకవర్గంలో పర్యటించిన ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి



ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డిని సన్మానిస్తున్న స్థానికులు

బొల్లారం, ఏప్రిల్ 21: సమాజాభివృద్ధికి నిరంతరం తపించే సమాజ సేవకుడు, మాజీ కలెక్టర్, బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ రోజా రాణి, మాజీ జడ్పీటీసీ కోలన్ బాల్‌రెడ్డి, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మున్సిపాలిటీకి వచ్చిన ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అనంతరం కేబీఆర్ కాలనీలోని సాయిబాబా ఆలయంలో సాయి నాథుడిని, భవాని అమ్మవారు, శివాలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. మెదక్ లోక్‌సభ బరిలో సమాజ సేవకుడు, విద్యావంతుడు, పరిపాలన దక్షత తెలిసిన వ్యక్తి వెంకట్రామిరెడ్డిని మాజీ సీఎం కేసీఆర్ ఎంపీ అభ్యర్థిగా నిలిపారన్నారు. తెలంగాణ వాదాన్ని పార్లమెంటులో బలంగా వినిపించేందుకు వెంకట్రామిరెడ్డిని గెలిపించాలని కోరారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరె గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి మెదక్ జిల్లాలో వివిధ హోదాల్లో పనిచేసిన అనుభవం తనకు ఉన్నదని, ప్రతి గ్రామంలో ప్రభుత్వ నిధులతోపాటు సొంత నిధులతో వివిధ కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళికలు రచించినట్లు తెలిపారు. బీఆర్ఎస్ విజయానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్.. బీజేపీ దొందుదొందే



ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎంపీపీ దేవానంద్

అమీన్‌పూర్, ఏప్రిల్ 21: అవినీతికి చిరునామాగా పేరొందిన కాంగ్రెస్ పార్టీని.. మతోన్మాదం పేరుతో ప్రజల మధ్య విభజన రాజకీయాలు చేస్తున్న బీజేపీ తెలంగాణ ప్రజలు నమ్మే స్థితిలో లేరని.. దశాబ్ద కాలంలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపిన కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్‌కు ప్రజల సంపూర్ణ మద్దతు ఉన్నదని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ మెదక్ లోక్‌సభ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆదివారం అమీన్‌పూర్ మండలం పటేల్‌గూడా గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీపీ దేవానందం గృహంలో మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. వెంకట్రామిరెడ్డి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కోరారు.

## సమావేశాన్ని జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

జిన్నారం, ఏప్రిల్ 21: బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ఈనెల 27న మండలంలోని గడ్డపోతారం ఫంక్షన్‌హాలులో నిర్వహించే బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం గడ్డపోతారంలో నిర్వహించిన జిన్నారం, గుమ్మడిదల మండలాలతో పాటు బొల్లారం మున్సిపాలిటీ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. సమావేశంలో జడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, గుమ్మడిదల జడ్పీటీసీ కుమార్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ, పార్టీ సీనియర్ నాయకులు కొలనుబాల్‌రెడ్డి, జిల్లా నాయకులు వెంకటేశంగౌడ్, గోవర్ధన్‌రెడ్డి, పార్టీ మండలాల అధ్యక్షుడు రాజేశ్, హుస్సేన్, మున్సిపల్ అధ్యక్షుడు హనుమంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పుట్టిన రోజు వేడుకలు

కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన అభిమానులు, బీఆర్ఎస్ శ్రేణులు



సంగారెడ్డి: ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌తో కేక్ కట్ చేయిస్తున్న అభిమానులు



కంది: ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



కొండాపూర్: ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు గజమాల వేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సంగారెడ్డి, ఏప్రిల్ 21: ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపేందుకు ఆదివారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయానికి నాయకులు, అభిమానులు భారీగా తరలివచ్చారు. ఎమ్మెల్యేకు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు.

**కందిలో..**

కంది, ఏప్రిల్ 21: సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. కంది మండల బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేతో కేక్ కట్ చేయించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని దేవున్ని వేడుకున్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఎంపీపీ సరళాపుల్లారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కాసాల బుచ్చిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఖాజాఖాన్, ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, గోపాల్ పాల్గొన్నారు.

**కొండాపూర్‌లో..**

కొండాపూర్, ఏప్రిల్ 21: ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ జన్మదిన వేడుకలు ఆదివారం మండలంలో ఘనంగా జరుపుకున్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. అనంతరం పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పద్మావతి పాండురంగం, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మ్యాకం విఠల్, ప్రధాన కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు నర్సింహులు, ప్రకాశం, రామాగౌడ్, నాయకులు రాజాగౌడ్, ఇంద్రారెడ్డి, అరవింద్‌రెడ్డి, బాలాగౌడ్, నసీరొద్దీన్, జైరాం, నర్సింహారెడ్డి, రవీందర్, కుమార్, నర్సింహులు, ప్రవీణ్ గౌడ్, ఆంజనేయులు, మైనార్టీ నాయకులు జలీల్, తదితరులు పాల్గొన్నారు.

# వీరభద్రేశ్వర స్వామి జాతరకు వేళాయె

- నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం
- భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు పూర్తి



ఆలయ ముఖద్వారం

న్యాల్‌కల్, ఏప్రిల్ 21: భక్తుల కోర్కెలు తీర్చే మండలంలోని మరియంపూర్ వీరభద్రేశ్వర స్వామి ఆలయం ఉత్సవాలకు ముస్తాబైంది. ఏండ్లుగా నిత్య పూజలందుకుంటున్న స్వామివారి జాతర సోమవారం నుంచి నుంచి 24వ తేదీ వరకు జరగనున్నది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా జాతర నిర్వాహక కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ఉత్సవాలకు మండలం నుంచే కాకుండా సమీపంలోని కర్ణాటక ప్రాంతం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. మొదటి రోజు 22న స్వామి వారికి పాదపూజ, మధ్యాహ్నం 3 గంటలకు గ్రామం నుంచి ఆలయానికి పల్లకీ ఊరేగింపు, రాత్రికి ఆలయంలో భజన కార్యక్రమాలు ఉంటాయి. 23న ఆలయ ప్రధాన పూజారి బస్వరాజ్ స్వామి ఆధ్వర్యంలో ఉదయం 5 గంటలకు స్వామివారికి రుద్రాభిషేకం, 9.30 గంటలకు డా.రాజశేఖర్ శివాచార్య స్వామి, 108 సోమ లింగ శివాచార్య, ఈశ్వరయ్యస్వామీజీ ఆలయాన్ని సందర్శించి భక్తులకు ప్రవచనాలు చేస్తారు. రాత్రి 9 గంటలకు పల్లకీ ఊరేగింపు, 24న ఉదయం 4 గంటలకు వీరభద్రేశ్వర స్వామివారి రథం ఊరేగింపు, 8 గంటలకు కుస్తీపోటీలు, భక్తులకు అన్నదానం, తీర్థప్రసాదాలు అందజేయడం వంటి కార్యక్రమాలు ఉండనున్నాయి.

# కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



నాగ్‌దర్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్, ఏప్రిల్ 21: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నదని, కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల్లోకి తీసుకెళ్లాలని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఆదివారం నిజాంపేట్ మండల పరిధిలోని నాగ్‌దర్ గ్రామంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ జహీరాబాద్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అనుసరిస్తున్న విధానాలకు ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపి, అడివప్ప, సాయిలు, రాజు, మల్లయ్య, బాల్‌రెడ్డి, నరేందర్, ము న్య, గోవింద్, అజయ్, పల్లె అంజయ్య, నాగగౌడ్, విఠల్‌గొండ, మొహినొద్దీన్, సాయిలు, ధన్ సింగ్, రాములు పాల్గొన్నారు.

# గాలి అనిల్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ ఈదులపల్లి శివకుమార్



మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ ఈదులపల్లి శివకుమార్

న్యాల్‌కల్, ఏప్రిల్ 21: జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీగా గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ ఈదులపల్లి శివకుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని చాల్కి చౌరస్తాలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని హుస్సేన్‌నగర్, చీకుర్తి, అమీరాబాద్, ముర్తుజాపూర్, కాకిజనవాడ, చాల్కి, రాఘవపూర్ తదితర గ్రామాల్లో గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా ఎమ్మెల్యే మానిక్‌రావు, నియోజవర్గ పార్లమెంటరీ ఇన్‌చార్జి దేవీప్రసాద్, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నరోత్తం తదితరులు పర్యటించనున్నట్లు తెలిపారు. ఇంటింటికీ వెళ్లి గత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తారన్నారు. కాంగ్రె స్ ఆరు గ్యారెంటీతో చేసిన మోసం, కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు వివరించి చైతన్యపరుస్తామన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావును భారీ మెజార్టీతో గెలిపించిన మాదిరిగానే గాలి అనిల్‌కుమార్‌కు కూడా భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్, పార్టీ నాయకులు భాస్కర్, నర్సింహారెడ్డి, ప్రవీణ్‌కుమార్, భూమారెడ్డి, వెంకట్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'జన జాతర'ను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర సభ్యుడు రమేశ్‌గౌడ్

సంగారెడ్డి, ఏప్రిల్ 21: ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల మాట్లాడుతూ అంబేద్కర్ లేకుంటే తాను ప్రధానిని అయ్యేవాడిని కాదని మాటల్లో సామాజిక న్యాయం వెల్లబోస్తూ, చేతల్లో అందుకు విరుద్ధంగా సంపన్నులకు సాయం చేయడం ఎంతవరకు సమంజసమని చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర సభ్యుడు రమేశ్‌గౌడ్ ప్రశ్నించారు. ఆదివారం పట్టణంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో కేవీపీఎ జిల్లా కార్యదర్శి అశోక్ అధ్యక్షతన సామాజి సంఘాల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన రమేశ్‌గౌడ్ మాట్లాడుతూ ఈ నెల 23న సంగారెడ్డి పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో ఉదయం 11 గంటలకు పూలే, అంబేద్కర్ మహనీయుల జనజాతర సదస్సు నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఆవాజ్ జిల్లా నాయకుడు ఖయ్యూం, పీఎన్ఎం జిల్లా కార్యదర్శి నాగభూషణం, కేయాపీఏ జిల్లా సహాయ కార్యదర్శులు మల్లేశం, దాసు, దత్తు, నాయకులు మహేశ్, అనిల్, ఆనంద్, శివ పాల్గొన్నారు.

## శ్రీను నాయక్‌కు నివాళిగా శాంతి ర్యాలీ



సిర్గాపూర్‌లో శాంతి ర్యాలీలో యువకులు

సిర్గాపూర్, ఏప్రిల్ 21: సిర్గాపూర్ సింగార్‌బొగుడ తండాలో హత్యకు గురైన శ్రీనునాయక్‌కు నివాళిగా ఆదివారం స్థానిక యువకులు పెద్దఎత్తున శాంతి బైక్ ర్యాలీ నిర్వహించారు. శనివారం సాయంత్రం తండాలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో శ్రీనునాయక్‌కు గాయలై మృతి చెందిన విషయం తెలిసిందే. సంగారెడ్డిలో ఆదివారం శ్రీను మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి సాయంత్రం గ్రామంలో కుటుంబీకులకు అప్పగించారు. సిర్గాపూర్‌కు మృతదేహం చేరుకోగానే యువకులు శ్రీనునాయక్ ఫ్లెక్సీలు చేతపట్టుకొని అమర్‌హై అంటూ శాంతి ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా శనివారం రాత్రి నుంచి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆదివారం సాయంత్రం పోలీసుల బందోబస్తు మధ్య శ్రీనునాయక్ అంత్యక్రియలు జరిగాయి. బాధిత కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి.

***తొమ్మిది మందిపై కేసు నమోదు***

శ్రీనునాయక్ హత్యకు కారకులైన తండాకు చెందిన తొమ్మిది మందిలో జాదవ్ రాజు, బిన్యానాయక్, పండరి, నరేశ్, హరి, నారాయణ, సురేశ్, సంతోష్, గోవింద్‌లపై హత్య కేసు నమోదు చేసినట్లు కంగ్టి సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు. అయితే నిందితులు పరారీలో ఉన్నారని చెప్పారు. మృతుడి తండ్రి వడిత్యా పండరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## వైభవంగా శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల కల్యాణంలో పాల్గొన్న మంత్రి దామోదర రాజనర్సింహ

అందోల్, ఏప్రిల్ 21: పట్టణంలోని జోగినాథస్వామి ఆలయ ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడు రోజులుగా రథోత్సవం, ఎడ్లబండ్ల ఊరేగింపు, అగ్నిగుండాలు, ప్రత్యేక పూజలు నిర్వహించగా.. ఆదివారం శివపార్వతుల కల్యాణాన్ని కనులపండుగగా నిర్వహించారు. వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణాల మధ్య నిర్వహించిన కల్యాణ వేడుకలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

***హాజరైన మంత్రి దామోదర***

జోగిపేట జోగినాథ స్వామి రథోవత్సంలో భాగంగా ఆదివారం నిర్వహించిన శివపార్వతుల కల్యాణానికి వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హాజరయ్యారు. ఆలయ నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికి పార్వతీపరమేశ్వరుల తలంబ్రాలు అందజేశారు. అనంతరం శాలువాతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జోగినాథ స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఎంతో చరిత్ర కలిగిన ఆలయం చరిత్ర, విశిష్టతను ముందు తరాలకు తెలిసేలా చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

## హుస్నెల్లి చెక్‌పోస్ట్ వద్ద నగదు పట్టివేత



హుస్నెల్లి చెక్‌పోస్టు వద్ద నగదును పట్టుకున్న పోలీసులు

న్యాల్‌కల్, ఏప్రిల్ 21: మండలంలోని హుస్నెల్లి అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద ఆదివారం రూ.68,100 నగదును పోలీసులు పట్టుకున్నారు. హద్నూర్ ఎస్ఐ రామనాయుడు కథనం ప్రకారం.. బీదర్–జహీరాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. కర్ణాటకలోని బీదర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న వాహనంలో రూ.68,100 నగదును స్వాధీనం చేసుకున్నారు. సరైన పత్రాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసినట్టు పేర్కొన్నారు.

## బీజేపీ అభ్యర్థి ప్రచారానికి ప్రజలు కరువు!

హత్నూర, ఏప్రిల్ 21: బీజేపీ ఎంపీ అభ్యర్థి నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి ఆశించినస్థాయిలో ప్రజలు హాజరుకాలేకపోవడంతో ప్రచారం నిర్వహించకుండానే వెనుదిరిగారు. శనివారం హత్నూర మండలం చందాపూర్, బోర్పట్ల, కాసాల, రెడ్డిఖానాపూర్‌లో బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందర్‌రావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం దౌల్తాబాద్ తెలంగాణతల్లి చౌరస్తా నుంచి గ్రామంలోని గాంధీవిగ్రహం వరకు రోడ్‌షో నిర్వహించి కొందరు స్థానిక నాయకులను పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం అక్కడ మాట్లాడాలని ఆపార్టీ నాయకులు కోరగా కేవలం నాయకులు, కార్యకర్తలు తప్ప ప్రజలు లేకపోవడంతో ప్రచారం నిర్వహించకుండానే వెనుదిరిగారు. ఎన్నికల సమయంలో ప్రజలులేకపోతే ఎలా ప్రచారం నిర్వహించేదని, ప్రజలను సమీకరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆపార్టీ నాయకులపై అసహనం వ్యక్తంచేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. పార్టీలో నాయకుల మధ్య నెలకొన్న విభేదాలతోనే ప్రజలను ప్రచారానికి తీసుకురాలేకపోయారని, ఎన్నికల సమయంలో విభేదాలు తలెత్తితే పార్టీకి నష్టం చేకూరుతుందని కొందరు కార్యకర్తలు బాహాటంగానే చర్చించుకున్నారు.

## ఎల్లమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



విగ్రహ ప్రతిష్ఠాపనలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

హత్నూర, ఏప్రిల్ 21: హత్నూర మండలం చింతల్ చెరువులో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనలో ఆదివారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. నూతన ఆలయం నిర్మించి అమ్మవారి విగ్రహం ప్రతిష్ఠించడం శుభ పరిణమం అన్నారు. ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. గ్రామాల్లో భక్తులు ఆలయాల అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సింలు, నాయకులు అంబటి అర్జున్, రాములు శ్రీకాంత్, వీరేశం తదితరులు ఉన్నారు.




బాచేపల్లిలో విజేతకు వెండి కడెం అందజేస్తున్న గ్రామస్తులు

## జోర్దార్‌గా కుస్తీ పోటీలు

కల్హేర్, ఏప్రిల్ 21: శ్రీరామ నవమిని పురస్కరించుకొని నిజాంపేట్ మండల పరిధిలోని బాచేపల్లిలో నాలుగు రోజుల ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన కుస్తీ పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీల్లో వివిధ మండలాలు, పక్క రాష్ట్రాల నుంచి మల్లయోధులు పాల్గొన్నారు. చివరి కుస్తీ పోటీలో కర్ణాటకలోని ఔరాద్‌కు చెందిన అయూబ్, అంతాపూర్‌కు చెందిన గంగారాంలు పోటీ పడగా అయూబ్ గెలుపొందాడు. విజేతకు ఎనిమిది తులాల వెండి కడెం అందజేశారు.

## 'ఓపెన్' విద్యార్థుల వీడ్కోలు సమావేశం



వీడ్కోలు సమావేశంలో విద్యార్థులు

బొల్లారం, ఏప్రిల్ 21: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓపెన్ టెన్త్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమకు విద్య బుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విశాలి, అడ్డాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## పెద్ద చెరువు వద్ద బాధితుల ధర్నా

అమీన్‌పూర్, ఏప్రిల్ 21: అమీన్‌పూర్ పెద్ద చెరువు ముంపు బాధితుల జేఏసీ సభ్యులు శనివారం చెరువు కట్టపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మైసమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం జేఏసీ అధ్యక్షుడు చిరునామా సత్యనారాయణ ఆధ్వర్యంలో సభ్యులు మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డిని కలిసి సమస్యలను విన్నవించారు. పెద్ద చెరువు మురుగునీటిని డైరెక్ట్ పైప్‌లైన్ ద్వారా తరలించాలని కోరారు.

## బీజేపీతోనే దేశాభివృద్ధి



బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న అభ్యర్థి రఘునందన్‌రావు

రామచంద్రాపురం, ఏప్రిల్ 21: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. ఆదివారం తెల్లాపూర్‌లోని మైహోమ్ అంకుర విలాస్ కమ్యూనిటీలో బీజేపీ జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి రఘునందన్‌రావు హాజరయ్యారు. అనంతరం పలువురు కమ్యూనిటీ వాసులు బీజేపీలో చేరారు. వారికి రఘునందన్‌రావు కండువాలు కప్పి పార్టీ ఆహ్వానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శంషాబాద్ రాజు, రామ్, నారాయణ, నగేశ్, దినేశ్, కార్తీక్, ఆదిత్య, రఘురాంరెడ్డి, దిలీప్, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

## బీజేపీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారితో ఎంపీ బీబీ పాటిల్

అందోల్, ఏప్రిల్ 21: బీజేపీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి ఎంపీ బీబీ పాటిల్ సమక్షంలో ఆదివారం అందోల్–జోగిపేట మున్సిపల్ కౌన్సిలర్లు గాజుల ధనలక్ష్మీఅనిల్, లక్ష్మీబాయి, మాజీ కౌన్సిలర్ గోపాల్‌రావు, మాజీ ఎంపీటీసీ ఎల్లయ్య పలువురు నాయకులు బీజేపీలో చేరారు. వారికి బీబీ పాటిల్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఓటువేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో అందోల్ ఎన్నికల ఇన్‌చార్జి పల్వట్ల జగదీశ్వర్, పార్టీ ప్రధాన కార్యదర్శి అనంతరావుకులకర్ణి, నాయకులు ప్రభాకర్‌గౌడ్, గాజుల నవీన్ పాల్గొన్నారు.

## బీబీ పాటిల్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

న్యాల్‌కల్, ఏప్రిల్ 21: బీజేపీ జహీరాబాద్ లోక్‌సభ అభ్యర్థి, ఎంపీ బీబీ పాటిల్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఓంకార్‌యాదవ్ కోరారు. ఆదివారం మండలంలోని టేకూర్, మిర్జాపూర్(ఎన్), ముంగి, చాల్కి, ఇబ్రహీంపూర్, హుమ్నాపూర్ తదితర గ్రామాల్లో ఎంపీ బీబీపాటిల్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధి కేవలం బీజేపీతోనే సాధ్యమవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి చైతన్య పర్చాలన్నారు. జహీరాబాద్ ఎంపీగా పోటీచేస్తున్న బీబీపాటిల్‌ను గెలిపించేందుకు పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జగన్నాథ్, రాహుల్ పాల్గొన్నారు.

## క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలి



బాక్స్ క్రికెట్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి

అమీన్‌పూర్, ఏప్రిల్ 21: విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంపొందించుకొనేలా తల్లితండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించాలని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని పీఎన్ఆర్ కాలనీలో ఏర్పాటుచేసిన బాక్స్ క్రికెట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కొద్దిసేపు క్రికెట్ ఆడి అందరినీ ఉత్సాహపరిచారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కల్పన ఉపేందర్ రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు తలారి రాములు పాల్గొన్నారు.

## ఘనంగా మహాదేవుని జాతర



గాజుల్‌పాడ్‌లో ఉత్సవమూర్తితో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

కంగ్టి, ఏప్రిల్ 21: మండలంలోని గాజుల్‌పాడ్ గ్రామంలో ఆదివారం మహాదేవుని జాతర ఘనంగా కొనసాగింది. రెండు రోజుల క్రితం ప్రారంభమైన జాతరలో భాగంగా ఆదివారం నిర్వహించిన మహాదేవుని ఉత్సవ విగ్రహ ఊరేగింపు కనులపండుగగా సాగింది. ఊరేగింపులో భాగంగా భక్తులు శివసత్తుల ప్రదర్శన, నృత్యాలు భజనకీర్తనలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఆలయ ఆవరణలో ఉత్సవమూర్తితో అర్చకులు అగ్నిగుండ ప్రవేశం చేశారు.